

జనా'కర్షక' బడ్జెట్



- అన్నదాతకు ఆర్థిక చేయూత
- వ్యవసాయ రంగానికి పెద్దపీట
- రూ.2,91,159 కోట్లతో రాష్ట్ర వార్షిక బడ్జెట్
- శాసనసభలో ప్రవేశపెట్టిన ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క
- వ్యవసాయ రంగానికి రూ.72,650 కోట్ల కేటాయింపు
- నియోజకవర్గానికి 3,500 ఇండ్లు

ఆసిఫాబాద్, జూలై 25: రాష్ట్ర ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క గురువారం అసెంబ్లీలో రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. రాష్ట్ర 2024-25 పూర్తిస్థాయి బడ్జెట్ రూ.2,91,159 కోట్లను ప్రవేశపెట్టారు. ఇందులో ప్రధానంగా వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ రూ.72,650 కోట్లను కేటాయించారు. ఈ బడ్జెట్ ద్వారా భూమిలేని అర్హులైన రైతుకూలీలకు ఏడాదికి రూ.12వేలు ఇవ్వనున్నట్లు వెల్ల డించారు. 33రకాల సన్నవడ్లకు రూ.500 బోనస్‌ను ఇవ్వనున్నట్లు ప్రకటించారు. పైసా ఖర్చు లేకుండా పంటలకు బీమాను అందించి రైతుకు పంట భద్రత కల్పించనున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించారు. దీంతో జిల్లాలో ఉన్న లక్షా అరవై వేల పై చిలుకు రైతులకు ప్రయోజనం చేకూరనుంది. రైతుకూలీలకు కూడా ప్రభుత్వం ఏటా రూ.12వేలు ఇవ్వనున్నట్లు ప్రకటించడంతో కూలీలకు ఆర్థికంగా భరోస చేకూరనుంది. సన్నవడ్లను సాగు చేసుకుంటున్న రైతులకు బోనస్ ప్రకటించడంతో లబ్ధి చేకూరనుంది. ఆరు గ్యారంటీలకు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించారు. రూ.500గ్యాస్ పథకానికి రూ.723కోట్లు, గృహజ్యోతి పథకానికి రూ.2418కోట్లు కేటాయించడంతో జిల్లాలో నిరుపేద మధ్యతరగతి కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. గూడులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇండ్లు కట్టుకోవడానికి రూ.5లక్షల ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయం తీసుకుంది. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు రూ.6లక్షల సహాయం అందించేందుకు నిర్ణయం తీసుకోగా 2024-25ఆర్థిక సంవత్సరంలో ప్రతి నియోజకవర్గంలో 3500 ఇండ్ల చొప్పున కేటాయించనున్నట్లు ప్రకటించింది. దీంతో జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లో మొత్తం 7వేల ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన ఇండ్లులేని నిరుపేదలకు అందనున్నాయి. మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు ఇందిర మహిళ శక్తి పథకంను రూపకల్పన చేసినట్లు బడ్జెట్‌లో ప్రకటించింది. ఇందుకోసం అవసరమైన నిధులను కేటాయించి మహిళా సంఘాలకు స్త్రీనిధి రుణాలను అందించనుంది. విద్యారంగానికి రూ.21,292కోట్లు కేటాయించగా జిల్లాలోని ప్రభుత్వపాఠశాలల్లో మౌళిక వసతుల కల్పన మెరుగుపడనుంది. నీటి పారుదల రంగానికి రూ.22,301కోట్లు కేటాయించగా జిల్లాలోని కుమరంభీం, జగన్నాథపూర్ కాలువల నిర్మాణాలు, వట్టివాగు, ఎన్టీఆర్ సాగర్ ప్రాజెక్టుల ఆధునీకరణకు నోచుకోను న్నాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ. 29,816 కోట్లు కేటాయించడంతో జిల్లాలోని రోడ్డులేని మారుమూల గిరిజన గ్రామా లకు రోడ్డుసౌకర్యంతో పాటు ఇతర మౌళికవసతులు సమకూరను న్నాయి. వైద్యరంగానికి రూ.11,468కోట్లు కేటాయించగా జిల్లాలోని ఏజేన్సీ మండలాల్లో వైద్యసేవలు మెరుగుపడనున్నాయి. ఎస్సీఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి అధిక నిధులు కేటాయించడంతో ఆయావర్గాల సంక్షేమానికి నిధులు సమకూర నున్నాయి. రాష్ట్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన వార్షికబడ్జెట్‌పై ప్రముఖుల అభిప్రా యాలు ఈ విధంగా ఉన్నాయి.

రాష్ట్ర ప్రగతికి అనుకూలమైన బడ్జెట్

- కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు, డీసీసీ అధ్యక్షుడు



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తెలంగాణ రాష్ట్ర ప్రగతికి అనుకూలంగా ఉంది. అప్పుల్లో ఉన్న తెలంగాణతో ఉన్నంతలో సర్దుకుని కేటాయించిన బడ్జెట్. కేంద్ర సహాయం లేకున్నా వ్యవసాయ రంగానికి అధిక నిధులు కేటాయించారు. నీటిపారుదల రంగానికి పెద్దపీట వేశారు. అర్బన్ డెవలప్‌మెంట్‌కు నిధులు కేటాయించడం హర్షనీయం. ఉన్నంతలో సంతోషమైన బడ్జెట్.

పేరుకే బడ్జెట్..

- అరిగెల నాగేశ్వర్‌రావు, బీజేపీ నాయకుడు



రాష్ట్ర ఆర్థికమంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ పేరుకే బడ్జెట్. బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు తప్ప అవి ఖర్చుపెట్టె పరిస్థితులు కనిపించడంలేదు. ఎన్నికల ముందు రైతుబంధ పథకం కింద రూ.15వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చినా బడ్జెట్‌లో ఆ ఊసే లేదు. బడ్జెట్‌లో బీసీ సంక్షేమాన్ని విస్మరించి తక్కువ నిధులు కేటాయించడం శోచనీయం.

మహిళా సంఘాలకు నిధులు కేటాయించడం హర్షనీయం..

- శ్రీదేవి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు



మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతానికి ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించడం హర్షనీయం. ఇందిర మహిళ శక్తి పథకం ద్వారా స్త్రీనిధి రుణాలను అందించనున్నట్లు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అభినందనీయం. ఈపథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల సమాఖ్యలకు లబ్ధి చేకూరుతుంది.

కేటాయింపులు తప్ప ఖర్చులు లేవు..

- దుర్గం దినకర్, సీపీఎం జిల్లా నాయకులు



రాష్ట్ర బడ్జెట్‌లో కేవలం కేటాయింపులే ఉంటాయి తప్ప అవి క్షేత్రస్థాయిలో ఖర్చు పెట్టలేరు. ప్రభుత్వం బడ్జెట్‌లో దళితబంధు స్థానంలో అంబేద్కర్ అభయహస్తం కింద రూ.12 లక్షలు ఇస్తామని గతంలో చెప్పినా ఇప్పుడు దాని ఊసేలేదు. పెన్షన్‌ల పెంపు ప్రస్తావన, నిరుద్యోగభృతి, విద్యా భరోస వంటి పథకాలకు బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు చేయలేదు.

బడ్జెట్‌లో పథకాల ఊసేలేదు..

-లెండుగురే శ్యాంరావు, బీఆర్‌ఎస్ సిర్పూరు నియోజకవర్గ కన్వీనర్



బడ్జెట్‌లో నిరుపేదల కోసం ఏర్పాటు చేసిన వివిధ పథకాల పద్దులు కేటాయించలేదు. దళిత బంధుకు దిక్కేలేదు. మత్స్యకారుల కోసం నిధులు పెట్టలేదు. భవిష్యత్తు కోసం ఏమీ చేస్తున్నారన్నది స్పష్టలేదు. ప్రజల ఆశల మీద నీళ్ల చల్లినట్టు చేశారు. ఒక్క పథకంపై కూడా స్పష్టత లేదు. దళితుల పట్ల అన్యాయం చేసింది. ఈ బడ్జెట్‌లో కొత్తది ఏమీ లేదు.

అంకెల గారడీగా ఉంది..

-గుళ్లపల్లి ఆనంద్, టీడీపీ ఉమ్మడి జిల్లా పార్లమెంటు కన్వీనర్



బడ్జెట్ అంతా కూడా అంకెల గారిడి ఉంది. మహిళా సంక్షేమం కోసం ప్రవేశ పెట్టిన పథకాల్లో క్లారిటీ లేదు. నిరుపేదల కోసం ఉన్న పథకాల్లో ఆశించిన మేర కేటాయింపులు లేవు. వివిధ కులాల వారికి నిధుల కేటాయింపు జరుగలేదు. రైతులకు కూడా పెద్దగా ఒరిగిందేమీ లేదు. బడ్జెట్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నా నిరాశే మిగిలింది.

రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాకు మొండి చేయి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

ఆసిఫాబాద్, జూలై 25: అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాకు మొండి చేయి చూపారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ ఆరోపించారు. గురువారం జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనమాట్లాడుతూ జిల్లాకు ప్రాణధారమైన ప్రాణహిత-చేవెళ్ల, అడ ప్రాజెక్టుతోపాటు ఇతర ప్రాజెక్టులకు నిధులు కేటాయించకపోవడం ఆ పార్టీకి జిల్లాపై ఉన్నప్రేమ తెలుపుతోందన్నారు. నీతిఆయోగ్‌లో అస్పిరేషన్ జిల్లాగా ఎన్నికైనజిల్లాను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు విశాల్, విజయ్, మురళీ, మల్లికార్జున్, సత్యనారాయణ, ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆహారం పరిశుభ్రంగా వండాలి

- గిరిజన శాఖ డీడీ రమాదేవి

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 25: వర్షాకాలంలో ఆహారం కలుషితం కాకుండా గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో ఆహారం పరిశుభ్రంగా వండాలని గిరిజనశాఖ డిప్యూటీడైరెక్టర్ రమాదేవి అన్నారు. గురువారం గిరిజన క్రీడా పాఠశాలలో కుక్, కామాటీలకు నిర్వహించిన ఒక్కరోజు వర్క్‌షాప్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈగలు, దోమలతో వ్యాధులు ప్రబలే కాలం కావడంతో అప్రమత్తతో ఉండి వ్యక్తిగత పరిశుభ్రత, వంటశాల శుభ్రత పాటించాలన్నారు. విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఏటీడీవో క్షేత్రయ్య, సీఎంవో ఉద్ధవ్, జీసీడీవో శకుంతల, తదితరులు పాల్గొన్నారు.

'పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి'

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 25: ఎస్సీప్రిమెట్రిక్ హాస్టల్‌వర్కర్స్‌కు పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదలచేయాలని ఎస్సీ డీడీ సజీవన్, డీబీసీడీడీ సత్యనారాయణకు ఐఎఫ్‌టీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. వాచ్‌మెన్, కుక్, కామాటి, ఔట్‌సోర్సింగ్ వర్కర్లకు అయిదు నెలలుగా, బీసీ హాస్టల్ వర్కర్‌లకు 9నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, విలాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్‌వోగా సిద్ధార్థ

ఆసిఫాబాద్ రూరల్, జూలై 25: ఆసిఫాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వోగా సిద్ధార్థను నియమిస్తూ జిల్లావైద్యాధికారి తుకారాంభట్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సిద్ధార్థకు నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమోనాగలక్ష్మి, సూపరింటెంఎంట్ చంద్రశేఖర్, డీఎస్‌వో రమేష్ చంద్ర, సిబ్బంది నరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

'బీసీ హాస్టల్‌కు పక్కా భవనం నిర్మించాలి'

ఆసిఫాబాద్, జూలై 25: జిల్లా కేంద్రంలోని బీసీహాస్టల్‌కు పక్కాభవనం నిర్మించాలని బీసీ యువజనసంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ డిమాండ్ చేశారు. గురువారం బీసీ హాస్టల్‌ను సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని పైకప్పు పెచ్చులూడి పోతోందని, దీంతో విద్యార్థులు భయాందోళన మధ్య ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. వెంటనే అధికారులు స్పందించిపక్కాభవనం నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సాయికృష్ణ, సాయన్న, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రోజంతా ముసురు

- ఉప్పొంగిన ప్రాణహిత, వాగులు





గర్భిణులను నాటుపడవలపై వాగు దాటిస్తున్న అధికారులు, విద్యార్థులను వాగు దాటిస్తున్న ఉపాధ్యాయుడు

బెజ్జూరు, జూలై 25: వారంరోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రాణహిత వరద పోటెత్తి బ్యాక్‌వాటర్ కారణంగా జలదిగ్బంధంలోనే 12గ్రామాలు చిక్కుకున్నాయి. కుశ్నపల్లి-సోమిని మధ్యలోలెవల్ వంతెన ఉప్పొంగి ప్రవహిస్తోంది. తలాయి-పాపన్నపేట, తలాయి-సోమిని మధ్య ప్రాణహిత బ్యాక్‌వాటర్ కారణంగా దారులన్నీ మూసుకుపోవడంతో బాహ్యప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. వాగుఅవతల ఉన్న సుస్మీర్, సోమిని, ఇప్పలగూడ, మొగవెల్లి, నాగెపల్లి, బండలగూడ, గెర్రెగూడ, తలాయి, తిక్కపల్లి, భీమారం, పాతసోమిని గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి.బెజ్జూరు ఎస్సై విక్రంవరద ప్రాంతాలను పరిశీలించి ప్రజలను అప్రమత్తంచేశారు. మండలంలోని తలాయిగ్రామానికి చెందిన లంగారి మేఘన, లావణ్యకు నెలలు నిండడంతో పురిటిసమయం దగ్గరపడింది. దీంతో తహసీల్దార్ భూమేశ్వర్ ఆదేశాల మేరకు ఆశావర్కర్ విమలవారిద్దరినీ నాటుపడవలపైదహెగాం మండలంలోని చిన్నరాస్పెల్లి, ఒడ్డుగూడ గ్రామాల్లోని తల్లిగారి ఇళ్లకు పంపించారు.

- జలదిగ్బంధంలోనే దిందా గ్రామం

చింతలమానేపల్లి: మండలంలో దిందా గ్రామం జలదిగ్బంధంలోనే ఉంది. దిందా గ్రామ ప్రజలకు వారంరోజులుగా రాకపోకలు నిలిచిపో యాయి. బాబాసాగర్-నాయకపుగూడవాగు ఉప్పొంగిప్రవహిస్తోంది. లోతట్టు ప్రాంతంలోఉన్న పంటలు పూర్తిగా జలమయమై పంటలపై తీవ్రప్రభావం చూపుతున్నాయి.

విద్యార్థులను వాగు దాటించిన ఉపాధ్యాయుడు..

పెంచికలపేట: మండలంలోని జైహింద్‌పూర్ గ్రామంలో ప్రభుత్వపాఠశాలను చేరాలంటే పెద్దఒర్రెను దాటాల్సి ఉంటుంది. గురువారం ఉదయం పాఠశాలకు వెళ్లే సమయంలో కొంతమేరకు నీటితో ఉన్న పెద్దఒర్రె ఏకదాటిగా కురిసిన వర్షానికి ఒక్కసారిగా ఉధృతంగా ప్రవహించింది. దీంతో పాఠశాల ముగివాక తిరిగి వస్తున్న క్రమంలో విద్యార్థులు ఒర్రెదాటలేనంతగా ప్రవాహం ఉండడంతో చేసేదేమి లేక ఉపాధ్యాయుడు సంతోష్ విద్యార్థులను ఒక్కొక్కరిగా భుజాలపై ఎత్తుకుని క్షేమంగా అవతలి ఒడ్డుకు చేర్చాడు.

వ్యక్తిని రక్షించిన ఎస్సై

సిర్పూర్(టి): వర్షాలకు మాకిడి, హుడ్కిలి, జక్కాపూర్ రోడ్లు, కల్వర్టుపై వరదనీరు చేరడంతోమహారాష్ట్రకు వెళ్లేరహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. హుడ్కిలి లిఫ్టుఇరిగేషన్ వద్ద పెన్‌గంగా వరదనీటిలో వ్యక్తి చిక్కుకుని ఉన్నట్లు విషయం తెలుసుకున్న ఎస్సై దీకొండ రమేష్ సిబ్బందితో అక్కడికివెళ్లి ఆ వ్యక్తిని రక్షించారు. కాగా ఆవ్యక్తి రాజురా మహారాష్ట్రలోని రాజుగా చెబుతుండగా మతిస్థిమితం కోల్పోయి ఉన్నట్లు పోలీసు భావిస్తున్నారు.

కాగజ్‌నగర్:పట్టణంలోగురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లోకి వరదనీరు వచ్చింది. చిరువ్యాపారులు దుకాణాలు పెట్టలేదు.

కెరమెరి: మండలంలో పలుగ్రామాల సమీపంలోని వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వాగుల వద్ద సిబ్బందిని కాపలా ఉంచినట్లు ఎంపీడీవో అంజద్ పాషా, ఎస్సై విజయ్ తెలిపారు.

24 మందికి షోకాజ్ నోటీసులు

- రూ.87,500 రికవరీ
- ఉపాధి హామీ ప్రజావేదిక



మాట్లాడుతున్న డీఆర్డీవో పీడీ సురేందర్

సిర్పూర్(టి), జూలై 25: మండలకేంద్రంలోని రైతు వేదికలో గురువారం జాతీయ ఉపాధిహామీ పథకంలో 2023-24సంవత్సరంలో చేపట్టిన 386 పనులకు సంబంధించిన రూ.2,86,79,048 లకు గాను గ్రామీణఉపాధిహామీసిబ్బందితో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఇందులో 23 మంది ఫీల్డ్‌అసిస్టెంట్, టెక్నికల్‌అసిస్టెంట్లు, కార్యదర్శులకు షోకాజు నోటీసులు జారీచేయగా, ఒకఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ, రెండుపనులకు క్వాలిటీ కంట్రోల్ అధికారులతో తనిఖీచేపట్టాలని, రూ.42,50జరిమానా విదించామని డీఆర్డీవో పీడీసురేందర్ తెలిపారు. ఎంతటి వారైనా అవకతవకలకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. షోకాజు నోటీసులు అందకున్న వారుతప్పనిసరిగా సమాధానం ఇవ్వాలని, రివకరీడబ్బులు కట్టాలని ఆదేశించారు. కూలీలకు రూ.2,67,05,875 చెల్లించగా ఇందులో రూ.19,73,170మెటీరియల్‌కు వాడారన్నారు. సిర్పూర్(టి)మండలంలో రూ.2,86,79,048 పనులు చేపట్టారన్నారు. ఈ నివేదిక ఉన్నతాధికారులకు సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, గత ఎంపీడీవో రాజేశ్వర్, ఏపీఎం చంద్రయ్య, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్, కార్యదర్శులు, సామాజిక తనిఖీ బృందం సభ్యులు పాల్గొన్నారు.

గంజాయి, డ్రగ్స్‌ను అరికట్టాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జూలై 25: యువతను మత్తులో ముంచి చిత్తుచేసే గంజాయి, డ్రగ్స్ వినియోగానికి అడ్డుకట్టవేయాలని, గంజాయి, డ్రగ్స్‌ను నిర్మూలిద్దా మని, సమాజాన్ని కాపాడుదామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం డీవైఎస్‌ఐ ఆధ్వర్యంలో చేపట్టిన మాదకద్రవ్యాలను అరికడుదాం-సమాజాన్ని కాపాడుదాం- యువతను చైతన్య పర్చుదామని చేపడుతున్న అవగాహన సదస్సు పోస్టర్లను ఆయనవిడుదలచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశభవిష్యత్ యువతచేతుల్లో ఉందని, మాదకద్రవ్యాలమత్తులో చిత్తు కావద్దన్నారు. కార్యక్రమంలో నాయకులు మాలశ్రీ, రాజేందర్, కార్తీక్, టికానంద్, దినకర్, శ్రావణి, నిఖిల్, శ్రీకాంత్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను నాటి సంరక్షించాలి

రెబ్బెన: ప్రతిఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం రెబ్బెన మండలంలోని కైరిగూడలో వనమహోత్సవం, వృక్షారోపన్ అభియాన్‌లో ఆయన మాట్లాడారు. మొక్కలునాటితే భావితరాలవారికి కాలుష్య రహిత సమాజాన్ని అందించేందుకు చక్కటిఅవకాశం ఉంటుందన్నారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. సమావేశంలో జీఎంరవిప్రసాద్,జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, ఎస్‌వోటు జీఎం నరేందర్ పాల్గొన్నారు.



వృత్తిశిక్షణతో ఆర్థిక స్వావలంబన

శ్రీరాంపూర్, జూలై 25: వృత్తిశిక్షణతో మహిళలు ఆర్థికస్వావలంబన పొందవచ్చని శ్రీరాంపూర్ సింగరేణి సేవాసమితి(సేవా) అధ్యక్షురాలు రాధాకుమారి అన్నారు. 2023-24ఆర్థిక సంవత్సరంలో సేవాద్వారా వివిధ కోర్సుల్లో వృత్తిశిక్షణ పొందిన మహిళలకు గురువారం రాత పరీక్షలు నిర్వహించారు. టైలరింగ్, మగ్గం వర్క్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, తదితర కోర్సుల్లో 477మంది శిక్షణ పొందారని ఆమె పేర్కొన్నారు. శ్రీరాంపూర్‌లోని సీఈఆర్ క్లబ్, నస్పూర్ కాలనీలోని సేవాభవన్ పరీక్షల కేంద్రాలలో 362మంది పరీక్షలురాసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) పిఅరవిందరావు, ఖాదీవిలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు రీజినల్ అధికారి జె అనసూయ, సీనియర్ పీవో పి కాంతారావు, సేవాచీఫ్‌కో-ఆర్డినేటర్(హైదరాబాద్) డిఎస్ శివకుమార్, శిక్షకులు పాల్గొన్నారు.

జైపూర్: సింగరేణిసేవాసమితి ఎస్టీపీపీ ద్వారా టైలరింగ్ కోర్సులో2023-24 సంవత్సరానికి శిక్షణపొందిన మహిళలకుఎస్టీపీపీలోని సింగరేణి సేవాభవన్‌లో గురువారం పరీక్షలు నిర్వహించినట్లు పర్సనల్‌మేనేజర్ రామశాస్త్రి పేర్కొన్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన మహిళలకు ఖాదీగ్రామోద్యోగ్‌సంస్థ ద్వారా ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సేవాసమితి కోఆర్డినేటర్ అరుణ, టైలరింగ్ శిక్షకురాలు రఫియా పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో విఫలం

కాసిపేట, జూలై 25: కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో గుర్తింపు సంఘం ఏఐటీ యూసీ పూర్తిగా విఫలమైందని ఐఎన్‌టీ యూసీ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య అన్నారు. గురువారం కాసిపేట1వగనిలో బాయిబాట కార్యక్రమంలో కార్మికులను సమస్యలు అడిగితెలుసుకు న్నా రు. ఆయనమాట్లాడుతూ కార్మికులకు నాణ్యమైన పనిముట్లులేక ఇబ్బందులుపడు తున్నా రని, వెంటనే నాణ్యమైన పనిముట్లు ఇవ్వాల న్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించా లని లేకుంటే పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లూరి లక్ష్మణ్, చంద్రశేఖర్, వేణు, బాపు, కన్నయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

శ్రీరాంపూర్, జూలై 25: మొక్కలు నాటడం వల్ల పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్ అన్నారు. ఆర్కే5 గని ఆవరణలో నిర్వహించిన వనమహోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలునాటారు. అనంతరం మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వృక్షారోపన్-2024, రాష్ట్రప్రభుత్వం 75వ వనమహోత్సవాన్ని ప్రారంభించిందన్నారు. ఇందులో భాగంగా సింగరేణి ఆధ్వర్యంలో మొక్కలు నాటడం ఆనందంగా ఉందన్నారు. శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి. సంజీవరెడ్డి మాట్లాడుతూ, ఏరియావ్యాప్తంగా 20750మొక్కలు నాటడం లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 7200 మొక్కలను శ్రీరాంపూర్ పరిసర ప్రాంతాల వారికి పంపిణీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు రాధాకుమారి, ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీరాంపూర్ ఓసీపీ పీఓ టి శ్రీనివాస్, ఏజెంట్లు , తదితరులు పాల్గొన్నారు.

జైపూర్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలునాటి సంరక్షించాలని ఎస్టీపీపీ జీఎం శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం వృక్షారోపణ్ అభియాన్ వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఎస్టీపీపీలోని పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉత్పత్తిలో పర్యావరణానికి హాని కలిగే అవకాశం ఉన్నందున ఎస్టీపీపీ ప్రాంగణంలో, ప్రభావిత గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ ఐజీ (సీఐఎస్‌ఎఫ్) ఎస్ఆర్ శరవణన్, కమాం డెంట్ యోగేశ్‌పర్మార్, ఎస్టీపీపీ సీఎంవోఏఐ ప్రెసిడెంట్ సముద్రాల శ్రీనివాస్, ఏఐటీ యూసీ అసిస్టెంట్ పిట్ సెక్రటరీ పర్వయ్య, అధికారులు పాల్గొన్నారు.

కాసిపేట: వృక్షారోపన్ అభియాన్ వనమహోత్సవంలో భాగంగా మందమర్రి జీఎం మనోహర్ గురువారం సోమగూడెం, కేకే ఓసీపీ మైదానప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, ఎఫ్‌డీవో విజయ్‌కుమార్, ఎఫ్ఆర్‌వో సుభాష్, డిప్యూటి ఆర్‌వో ప్రవీణ్‌కుమార్, ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న జీఎం మనోహర్

మందమర్రిటౌన్: ప్రతిఒక్కరూ పదికిపైగా మొక్కలునాటి పర్యావరణాన్ని రక్షించాలని మందమర్రి జీఎం మనోహర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కేకే ఓసీపీ, రాళ్ల వాగు లీజ్‌హోల్డ్ ఏరియాలోని 300హెక్టార్లలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. జీఎం మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ వృక్షారోపన్‌అభియాన్, వనమహోత్సవం కార్యక్రమంలో బాగంగా మొక్కలు నాటుతున్నామన్నారు. మొక్కలతోనే మానవమనుగడ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏఐటీయూసీ ఆంజనేయులు, అధికారుల సంఘం అధ్యక్షుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.


'ఇన్‌కంటాక్స్ ఫైలింగ్‌లో బోగస్ క్లెయిమ్ చేయకూడదు'

మందమర్రిటౌన్, జూలై 25: సింగరేణి ఉద్యోగులకు సంబంధించి ఇన్‌కంటాక్స్ ఫైలింగ్‌లో బోగస్ క్లెయిమ్ చేయకూడదని ఇన్‌కంటాక్స్ అధికారులు సూర్యభగవాన్, సీహెచ్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం జీఎం కార్యాలయంలో పీఎం శ్యాంసుందర్ అధ్యక్షతన నిర్వహించిన ఇన్ కంటాక్స్ బోగస్ క్లెయిమ్స్ అవగాహన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఉద్యోగులు తప్పనిసరిగా ఇన్‌కంటాక్స్‌కు సంబంధించి ఉన్నవి మాత్రమే నమోదు చేసుకోవాలన్నారు. తప్పుడు సమాచారంతో ఫైలింగ్ చేస్తే ఇబ్బందుల పాలవుతారని తెలిపారు. ఈనెల31వరకు చివరి తేదీ అన్నారు. ఉద్యోగులు ఐటీ రిటర్న్ చేసుకోవడం మంచిదని తెలిపారు.



ఒకరిపై కేసు నమోదు

కన్నెపల్లి, జూలై 25 : సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు కన్నెపల్లి ఎస్ఐ గంగారాం గురువారం తెలిపారు. మండలంలోని జన్కాపూర్ గ్రామానికి చెందిన మాధవరపు నరసింగరావు తన అనుచరులతోకలిసి పేదల భూములు కబ్జా చేస్తున్నారని ఆరోపిస్తూ సోషల్ మీడియాలో రత్నం సోము అనే వ్యక్తి అసత్యపు పోస్టులు చేయడంతో కేసు నమోదు చేశామని చెప్పారు. ఎవరైనా సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.







మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్టు


కాసిపేట, జూలై 25: మండలంలోని లంబాడితండా(డీ)కు చెందిన ఓ మహి ళ(44) తన కోరిక తీర్చలేదని హత్య చేసిన ఘటనలో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. గురువారం దే వాపూర్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివ రాలను సీఐ వెల్లడించారు. మహిళ ఒంటరిగా ఉన్నదని గ్రహించిన రాముగూడకు చెందిన కుడిమేత అంబారావు అత్యాచారయత్నానికి ప్రయత్నించగా ఆమె ప్రతిఘటించింది. దీంతో కోపోద్రిక్తుడైన అంబారావు ఆమెను గొంతు నులిమి హత్యచేసి పారిపోయాడు. గురువారం మధ్యాహ్నం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు, పోలీసులు పాల్గొన్నారు.

అతిగా మద్యం సేవించి ఒకరి మృతి

బెల్లంపల్లి(తాండూర్), జూలై 25 : మండలంలోని రేచిని రైల్వేస్టేషన్ ప్రాం తంలో గల గాడి రాజు(43) అనే వ్యక్తి అతి మద్యం సేవించి మృతిచెందినట్లు గురువారం ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. గత కొన్ని రోజులుగా కూలీ పనులకు వెళ్లకుండా మద్యానికి బానిసయ్యాడు. గురువారం అతిగా మద్యం సేవించి అపస్మారక స్థితిలోకి వెళ్లగా భార్య బెల్లంపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందాడని తెలిపినట్లు తెలిపారు. రాజు భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.







ఆటో యూనియన్ల వివాదం

- పోలీస్ స్టేషన్‌కు చేరిన పంచాయితీ



పోలీస్‌స్టేషన్ నుంచి బయటకు వస్తున్న ఆటో యూనియన్ల నాయకులు

మంచిర్యాల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో రెండు ఆటో యూనియన్ల మధ్య ఏర్పడ్డ పంచాయితీ చివరికి పోలీస్ స్టేషన్‌కు చేరింది. ఇరు సంఘాల నాయకులతో మాట్లాడిన పోలీసులు నూతన కమిటీ ఏర్పాటు చేయవద్దనే హుకుం జారీ చేశారు. ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ మంచిర్యాల పేరుతో గత 25 ఏళ్లుగా జిల్లా యూనియన్ కొనసాగుతోంది. ఇటీవల కొందరు వ్యక్తులు మరో యూనియన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. దానికి అనుబంధంగా పట్టణ కమిటీని కూడా నియమించారు. కాగాపాత యూనియన్‌కు సంబంధించి పట్టణ కమిటీ పదవీకాలం ముగియడంతో ఎన్నికలు నిర్వహించేందుకు ఆ సంఘం నాయకులు సన్నద్ధం అవుతున్నారు. శుక్రవారం నూతన కమిటీని నియమించుకోవలసి ఉంది. రెండు యూనియన్ల సభ్యులు ఎన్నికల విషయమై పరస్పరం చర్చలు జరుపగా విఫలం కావడంతో పంచాయతీ పోలీస్ స్టేషన్‌కు చేరింది. ఇటీవల కొత్తగా వేసిన కమిటీ సభ్యులు ఏసీపీ కార్యాలయానికి చేరుకొని తమను వాట్సాప్‌లో దూషించాడని పాత యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పొట్ట మధూకర్‌పై ఫిర్యాదు చేశారు. వారిని తన కార్యాలయంలో కూర్చోబెట్టిన ఏసీపీ ప్రకాష్, పొట్ట మధూకర్‌ను పిలిపించి ఫిర్యాదు అందిందని, ఎన్నికల పేరుతో అనవసరంగా కేసులో ఇరుక్కోవద్దని హెచ్చరించినట్లు సమాచారం. కాగా ఒక వర్గానికి చెందిన యూనియన్ నాయకులను ఏసీపీ తన చాంబర్‌లో కూర్చోబెట్టి మరీ పంచాయతీ చేయడం వివాదాస్పదమైంది. ఇదిలా ఉండగా ఎన్నికలకు వెళ్లకూడదనే ఉద్దేశ్యంతోనే కొత్త కమిటీ సభ్యులు ఏసీపీ చేత వార్నింగ్ ఇప్పించినట్లు పొట్ట మధూకర్ తెలిపారు. తమది రిజిష్టర్డ్ యూనియన్ అని, ప్రజాస్వామ్యబద్ధంగా మెజార్టీ ఆటో డ్రైవర్ల కోరిక మేరకు ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. కాగా ఈ విషయమై ఏసీపీ ప్రకాష్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా పొట్ట మధూకర్‌పై ఫిర్యాదు రావడంతో పట్టణ సీఐకి ఎండార్స్ చేశానే తప్ప...తాను ఎవరినీ కార్యాలయానికి పిలిపించి హెచ్చరించలేదని తెలిపారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

కౌటాల, జూలై 25: మండలం తుమ్మిడిహెట్టి గ్రామానికి చెందిన పోరెత్ అశ్విని(23) మంచిర్యాల ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందినట్లు ఎస్సై మధుకర్ తెలిపారు. మృతురాలి తండ్రి, ఎస్సైతెలిపిన వివరాలప్రకారం... అశ్విని కడుపునొప్పితో బాధపడు తోంది. ఈనెల 18న కడుపునొప్పి తీవ్రం కావడంతో ఇంట్లో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు మంచిర్యాల ఆసుప త్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. మృతు రాలి తండ్రి మారుతి ఇచ్చినఫిర్యాదు మేరకు కేసునమోదు చేసిదర్యాప్తు జరుపు తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైతు బీమా దరఖాస్తుల స్వీకరణ

కెరమెరి, జూలై 25: ధనోర రైతువేదికలో గురువారం ఏఈవో ప్రభావతి రైతుబీమా దరఖాస్తులను స్వీకరించారు. కొత్తగా పట్టాదారు పాసు పుస్తకంపొందిన, దరఖాస్తుచేసుకోనిరైతులుదరఖాస్తు చేసుకోవాలన్నారు.

బేకరీ సీజ్

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 25: పట్టణంలోని జన్కాపూర్‌లోగల దేవి స్వీట్‌హౌజ్‌అండ్ బేకరీనిగురువారం మున్సిపల్ అధికారులు సీజ్‌చేశారు. బేకరీ తనిఖీల్లో భాగంగా డేట్ అయిపోయిన చిప్స్ ప్యాకెట్లు, బూజు పట్టిన స్వీట్స్ గుర్తించామన్నారు. దుకాణం యజమానికి జరిమానా విధించి సీజ్ చేశామని కమిషనర్ భుజంగరావు తెలిపారు.

గ్రామాల్లో పారిశుధ్యం పనులు

జైనూర్, జూలై 25: ముసురువర్షంతో గ్రామాల్లో దోమలు వృద్ధి చెందకుండా మండలంలోని జండాగూడ, పానాపటార్, పట్నాపూర్ తదితర గ్రామాల్లో గురువారం గ్రామపంచాయతీ కార్మికులు పారిశుధ్య పనులు చేపట్టారు. అపరిశుభ్ర మైన స్థలాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు.

చదవుతోనే ఉజ్వల భవిష్యతు

లింగాపూర్, జూలై 25: చదవుతోనే ఉజ్వల భవిష్యతు ఉంటుందని ఆదివాసీ సంఘాల ఐకాసా రాష్ట్రఅధ్యక్షుడు కనకయాదవ్‌రావు అన్నారు. గురువారం కంచన్‌పల్లి ఆశ్రమపాఠశాలను సందర్శించారు.

కేజీబీవీలో బోనాల పండుగ

లింగాపూర్, జూలై 25: మండల కేంద్రంలోగల కస్తూర్బా బాలికల విద్యాలయంలో గురువారం బోనాల పండుగను కేజీబీవీ ప్రత్యేకాధికారి సరస్వతి విద్యార్థినులతో కలిసి నిర్వహించారు.

లో లెవల్ వంతెన వద్ద చెత్తాచెదారం తొలగింపు

కెరమెరి, జూలై 25: వర్షాలకు మండలంలోని కేలి(బి), సాంగ్వి గ్రామాల మధ్య ఉన్న లోలెవల్ వంతెనపై వరదనీరు ప్రవహించగా ఏర్పడిన చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతోఅధికారులు ఎక్స్‌కావేటర్‌తో పూడికమట్టిని, వ్యర్థాలను తొలగించారు.

కేజీబీవీ కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన

రెబ్బెన, జూలై 24: కేజీబీవీలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంటుచేయాలని గురువారం కేజీబీవీలో కాంట్రాక్టు ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఎన్నికల సమయంలో సీఎం ఇచ్చిన హామీని అమలుపర్చాలని కోరారు.

'రోడ్లకు నిధులు విడుదల చేయించాలి'

బెజ్జూరు, జూలై 25: నియోజకవర్గంలో రోడ్లకు నిధులు మంజూరు చేయించాలని గురువారం ఎమ్మెల్సీ దండె విఠల్‌ను కాంగ్రెస్ నాయకుడు హర్షద్‌హుస్సేన్ కోరారు. దీంతో ఆయన సీఎంను, మంత్రిసీతక్క దృష్టికి తీసుకుపోయి రోడ్లనిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు.

పీఆర్టీయూటీఎస్ సభ్యత్వ నమోదు

జన్నారం, జూలై 25: కిష్టాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం పీఆర్టీయూటీఎస్ సభ్యత్వ నమోదు చేపట్టారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజమౌళి సత్యనారాయణ పాల్గొన్నారు.



చింతన

మనిషి జన్మకు పరమార్థం ఏమిటన్నది చిరకాల ప్రశ్న. సమాధానాలు అనేకం ఉన్నా, 'ముక్తి సాధన' అనేది ఏ ఒక్కరూ కాదనలేనిది. దీనికి మరో పేరు 'మోక్ష ప్రాప్తి'. జనన, మరణ బంధం నుంచి విమోచన పొందడం అన్నమాట. అంటే, ఆ చక్రం నుంచే బయటపడటం. ఇది మాటలు, రాతలు కాదు... చేతలతోనే సాధ్యమవుతుంది. దీనికి ఏకైక మార్గం... ప్రతీ వ్యక్తీ ఆత్మజ్ఞానం కలిగి ఉండడమే. ఎవరి గురించి వారు తెలుసుకోవాలంటే దైవశక్తినే సాధనంగా భావించాలి. తెలుసుకునే క్రమంలో మన ముందు నాలుగు మార్గాలు కనిపిస్తాయి.. అవన్నీ 'గ'కారంతో మొదలయ్యేవే. అంటే... 'గ'కార చతుష్టయం. అవి: గీత, గంగానది, గాయత్రీ మంత్రం, గోవింద నామం. నిత్యజీవితంలో వీటి స్మరణ మానవ జీవితానికి సార్థకత కలిగిస్తుందని భారతీయ సంస్కృతిని చాటి చెబుతోంది. అదే విషయాన్ని 'ఆత్మ నివేదనం' పేరిట విపులీకరిస్తోంది. 'నివేదన' అంటే 'సమర్పణ' అని అర్థం. మనసును, వాక్కును, కర్మను కేంద్రీకరించడం. ఈ కేంద్రీకరణ ద్వారానే స్వీయ పరిశీలన వేగవంతమవుతుంది.



ముక్తి సాధన కోసం... గకార చతుష్టయం

చతుర్వేదాల సారాంశం

'గ'కార చతుష్టయంలో మొదటిది భగవద్గీత. ఇందులో ఉన్నదంతా వేద విజ్ఞాన సారం. వేదాలు నాలుగు. ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వ వేదం. 'వేదం' అనేది 'విద్' (తెలియడం) నుంచి ఏర్పడింది.

ఋగ్వేదం అంటే దేవ వేదమే. ఇందులోని కొన్ని సూక్తాలు పురాణాలను, సామాజిక వర్తనను వివరిస్తాయి. యజుర్వేదం యజ్ఞ నిర్వహణ రీతిని తెలుపుతుంది. మధురతకు సూచిక సామ వేదం. అంతేకాక, సకల జ్ఞాన ప్రదాయని. అథర్వ(ణ) వేదం ఆ ఋషి పేరు మీదుగా వచ్చింది. ఇందులోనూ శాస్త్రీయ పరిజ్ఞాన వైభవం కనిపిస్తుంటుంది. చతుర్వేదాల సారాంశ సమాహారం కాబట్టే.. భగవద్గీతకు అంతటి ప్రసిద్ధి, విశిష్టత కలిగాయి.

వేదమాత

గాయత్రీదేవి వేదమాతగా ప్రశస్తి అందుకుంది. 'గయలు' అంటే ప్రాణాలు. 'త్రాయతే' అనే పదానికి పరిరక్షణ అని అర్థం. అందుకే ప్రాణ సంరక్షకురాలుగా గాయత్రిని ఆరాధి



స్తారు. గాయత్రీ మంత్రంలోని "ఓం భూర్భువ స్సువః తత్సవితుర్వరేణ్యమ్'ను పరిశీలిస్తే... 'ఓం (సర్వ రక్షణ), భూ (ఉనికి), భువ (జ్ఞాన రూపం), స్వ (ఆనంద స్వరూపం), తత్ (అటువంటి లక్షణ సమన్విత పరమేశుడు), సవితు (విశ్వ కర్త) వరేణ్యం (సర్వులతో ఆరాధనీయులు)' అనే భావార్థాలు ఇమిడి ఉన్నాయి. ఇవన్నీ సంప్రదాయ పరంగా, శాస్త్రీయంగా కూడా ప్రామాణికాలు.



అనంత ఫలప్రదం

ఇక గోవింద నామం... 'గకార చతుష్టయంలో దీని పాత్ర అనంతం. 'శ్రీనివాసా, శ్రీవేంకటేశా, నిత్య నిర్మలా, భక్త వత్సలా, దినకర తేజా' అని స్మరణలు చేస్తారు ఆరాధకులు. 'గోవింద' అంటే భూ పరిరక్షకుడు. వేదాల వల్ల ఘనతరుడనే అంతరార్థమూ ఉంది. గోవింద నామం అనంత ఫలప్రదం.

యోగవిద్యకు సంబంధించి సాధన చతుష్టయమనే మాట వినిపిస్తూ ఉంటుంది. వివేకంతో వ్యవహరించడం, యథాతథ స్థితిని గ్రహించగలగడం, సంపత్ లేదా సమతుల్యతను కోరుకోవడం, ఆత్మ జ్ఞాన ప్రాప్తికి పలు విధాలుగా ప్రయత్నించడం. ఇదంతా అభ్యాస సాధనాల క్రమం. వీటన్నిటి ఫలితంగా స్వయం పరిశీలన శక్తి విస్తారమవుతుంది. క్రమేణా ముక్తి ప్రాప్తికి మార్గం సులభతరంగా మారుతుంది.

మానసిక, నైతిక పరమోన్నత స్థితే ముక్తి. అంటే.. వ్యక్తి తన సహజత్వాన్ని పొందగలగడం. దీనికి మూలాధారం ఆత్మ నివేదన. దైవం పట్ల పరిపూర్ణ ప్రేమను వ్యక్తపరచే రీతి. భక్తి మార్గాలు ఎన్నో ఉంటాయి. వాటన్నిటికన్నా నివేదన విధానమే భగవంతుడిని, భక్తుడిని అనుసంధానిస్తుంది. పత్రం, పుష్పం, ఫలం, చివరికి నీటినైనా భక్తితో సమర్పిస్తే ప్రీతిగా స్వీకరిస్తానన్నది గీతాచార్యుడి మాట. నిజానికి మనిషి శరీరం ఆకు వంటిదే. రాలిపోతుందే తప్ప, శాశ్వతం కాదు. అందువల్ల పత్ర అర్చనకు ఆ వ్యక్తి సంసిద్ధం కావాలి. తన మనోవనంలోని మొగ్గను పుష్పంలా వికసింప చేయాలి. ఆ వికసిత పుష్పమే విజ్ఞాన ఫలంగా రూపాంతరం చెందడాన్ని సమర్పణగా వర్ణిస్తుంది మన భారతీయ ధార్మిక చింతన. పవిత్ర గీత, పావన గంగ, శక్తిదాయక గాయత్రి, స్ఫూర్తిప్రదాయ గోవింద స్మరణలకు మనను మనం సమర్పించుకుంటేనే జీవితాలకు ధన్యత. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, భక్తి జ్ఞాన కర్మ యోగాదులు చాటి చెబుతున్నది ఇటువంటి ఆత్మ సమర్పణ పద్ధతినే.

• జంధ్యాల శరత్‌బాబు
99483 45013


భువనపావని...

యమున, కృష్ణా, గోదావరి, కావేరి, సింధు, నర్మదలతో పాటు సప్త నదుల్లో ఒకటి గంగ. 'భువన పావని', 'అనంత వాహిని' అనేవి దాని నామాంతరాలు. మన సంస్కృతి, చరిత్ర, వ్యవస్థ అంతా గంగానదితో మమేకమై ఉంది. గంగమ్మ తల్లిగా, గంగా భవానీగా పిలిచేది అందుకే. గంగను నీటికి పర్యాయపదంగా మనం ఉపయోగిస్తాం.. గంగ మరెన్నో నదులతో కలసి మహా ప్రవాహంగా మారుతుంది. ఆ జల స్నానం భారతీయులకు పరమ పవిత్రం. గంగా, యమున, సరస్వతీ నదుల సంగమ స్థలాన (త్రివేణి) కుంభ మేళాలు ఏర్పాటవుతుంటాయి. అలహాబాద్ (ప్రయాగ)లో ఈ మహోత్సవం వచ్చే ఏడాది జనవరిలో మొదలవుతుంది. ఇంతటి మేటి విశిష్టత కారణంగా... గంగ విశ్వ విఖ్యాతి పొందింది.

సుభాషితం

సజ్జన లక్షణాలు

ప్రదానం ప్రచ్ఛన్నం గృహ ముపగతే సంభ్రమవిధిః
ప్రియంకృత్వా మౌనం సదసి కథనం చాప్యుపకృతేః
అనుత్సేకో లక్ష్మ్యాం నిరభిభవసారాః పరకథాః
సతాం కేనోద్దిష్టం విషమ మసిధారావ్రత మిదమ్



సజ్జనుల్లో సహజంగా ఉండే లక్షణాల గురించి 'నీతి శతకం'లో భర్తృహరి వివరించిన శ్లోకం ఇది. దీన్ని...

పొసగస్ దానము గుప్త మర్థి భవనంబు జేరుచో సంభ్రమో
ల్లసదుత్థానవిధానముం బ్రియవిధుల్ గావించి మౌనంబు రా
జసభస్ మిత్రకృత ప్రకాశనము గుత్సాకర్ణ వైముఖ్య మీ
యసిధారావ్రతచర్య యెవ్వడు మహార్యశ్రేణికిం దెల్పెనో... అంటూ ఏనుగు లక్ష్మణకవి సముచిత రీతిలో తెలుగువారికి సమర్పించాడు.

భావం: దానాలు చేస్తున్నానని చాటింపు వేసుకోకుండా రహస్యంగా చేయడం. ఇంటికి వచ్చి యాచించిన వారిని ఆదరించడం. వేరొకరికి తను చేసిన మేలు గురించి ప్రచారం చేసుకోకపోవడం, వేరొకరు తనకు చేసిన మేలును పదిమందికీ చెప్పడం, ఎన్ని సంపదలు వచ్చినా వినయంగా ఉండడం, పరుల గురించి చెడ్డగా మాట్లాడకపోవడం... వీటన్నిటినీ పాటించడం కత్తిమీద సాములాంటిది. ఈ గుణాలు ఎవరో బోధిస్తేనో, నేర్పితేనో రావు. సజ్జనుల్లో ఈ లక్షణాలు స్వతస్సిద్ధంగా ఉంటాయి.

సద్బోధ

యోగి- సాధువు

పూర్వం ఒక యోగి అకుంఠితమైన తపస్సు చేసి, కొన్ని గొప్ప శక్తులను సంపాదించాడు. అతను స్వతహాగా మంచివాడు. కానీ తన శక్తులంటే అతనికి గర్వం ఉండేది. వాటిని ప్రదర్శించాలనే కోరిక ఉండేది. ఆ గర్వాన్ని తగ్గించాలని దేవుడు అనుకున్నాడు. ఒక రోజు... సాధువు రూపంలో ఆ యోగి దగ్గరకు వచ్చాడు. "స్వామీ! మీకు అద్భుతమైన శక్తులు ఉన్నాయని విన్నాను. మిమ్మల్ని దర్శించుకోవాలని వచ్చాను" అని అన్నాడు. మాటలు విన్న యోగి ఉప్పొంగిపోయాడు. మునిని సాదరంగా ఆహ్వానించి, ఆతిథ్యం ఇచ్చాడు.

ఈలోగా అటువైపు ఒక ఏనుగు వెళుతోంది. సాధువు దాన్ని చూపిస్తూ "స్వామీ! మీరు కోరుకుంటే ఆ ఏనుగును చంపగలరా?" అని అడిగాడు.

"ఎందుకు చంపలేను? ఇదిగో చూడండి" అంటూ నేల మీద పిడికెడు మట్టి తీసుకున్నాడు యోగి. దాన్ని మంత్రించి ఏనుగు మీదకు విసిరాడు. ఆ ఏనుగు నొప్పితో విలవిలలాడుతూ నేల మీద పడి మరణించింది.

'చూశావా!' అన్నట్టు గర్వంగా తలాడించాడు యోగి.


"మీ శక్తులు అమోఘం స్వామీ! మీరు ఏనుగును చంపేశారు. మరి దాన్ని మళ్ళీ బతికించగలరా?" అని అడిగాడు సాధువు.

"తప్పకుండా" అంటూ మరికాస్త మట్టి తీసుకొని, మంత్రించి, మరణించిన ఏనుగు మీద చల్లాడు యోగి. ఆ ఏనుగు లేచి నిలబడింది. శరీరానికి అంటుకున్న దుమ్మును విదిలించుకుంటూ అడవిలోకి నడిచింది.

"స్వామీ! మీకు అపారమైన శక్తులు ఉన్నాయి. కానీ నాకొక సందేహం ఉంది తీరుస్తారా?" అన్నాడు సాధువు.

"దానికేం? అడగండి" అన్నాడు యోగి.

"మీరు ఏనుగును చంపారు. దాన్ని మళ్ళీ బతికించారు. కానీ అందువల్ల మీకు కలిగిన ప్రయోజనం ఏమిటి? ఆధ్యాత్మికమైన ఉన్నతి కలిగిందా? మోక్షాన్ని, భగవంతుణ్ణి చేరే మార్గం దొరికిందా?" అని ప్రశ్నించాడు సాధువు.



ఆ మాటలకు యోగి దిగ్భ్రాంతి చెందాడు. సాధువు రూపంలో ఉన్న దేవుడు చిరునవ్వు నవ్వుతూ మాయమైపోయాడు. ఇంతసేపూ తన ముందు ఉన్నది సాక్షాత్తూ భగవంతుడేనని యోగికి అర్థమయింది. ఆ క్షణం నుంచి అతనిలో గర్వం, కోరికలు పూర్తిగా నశించిపోయాయి.

శ్రీ రామకృష్ణ పరమహంస తన శిష్యులకు ఈ కథ చెబుతూ "సూది బెజ్జానికి అడ్డుగా కంటికి కనిపించని చిన్న నలుసు ఉన్నా సరే... దానిలోంచి దారం వెళ్ళడం కష్టమవుతుంది. అదే విధంగా సాధకుల్లో ఇసుకరేణువంత కోరిక, గర్వం మిగిలి ఉన్నా... పరమాత్మ తత్త్వాన్ని గ్రహించలేరు. మోక్షపు దాన్ని అందుకోలేరు" అని స్పష్టం చేశారు.

'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/MNuqlklలో చదవండి.

బిజినెస్

టెక్ మహీంద్రా లాభంలో 23% వృద్ధి

క్యూ1లో రూ.851 కోట్లుగా నమోదు.. రూ.13,005 కోట్లకు తగ్గిన ఆదాయం



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి (క్యూ) టెక్ మహీంద్రా రూ.851 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇదే కాలానికి గడించిన రూ.692.5 కోట్ల లాభంతో పోలిస్తే, ఈసారి 23 శాతం వృద్ధి నమోదైంది. కాగా, ఈ క్యూ1లో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 1.2 శాతం తగ్గి రూ.13,005 కోట్లకు పరిమితమైంది. ఆదాయం తగ్గినప్పటికీ, మొత్తం వ్యయాలు 2.3 శాతం తగ్గి రూ.955 కోట్లకు పరిమితం కావడం, వడ్డీ ఖర్చులు 40 శాతం తగ్గి రూ.715 కోట్లకు దిగిరావడం లాభాల్లో మెరుగైన వృద్ధికి దోహద పడింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2024-25 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ మరింత మెరుగైన పనితీరు కనబర్చనుందని టెక్ మహీంద్రా కొత్త ఎండీ, సీఈఓ మోహిత్ జోషి అన్నారు.

- సేవల వ్యయం తగ్గడంతో క్యూ1లో కంపెనీ నిర్వహణ లాభాల మార్జిన్ మరో 1.9 శాతం పెరిగి 12 శాతంగా నమోదైంది. ఇకపై లాభాల మార్జిన్ క్రమంగా పుంజుకోనుందని మోహిత్ జోషి అన్నారు.
- గడిచిన మూడు నెలల్లో కంపెనీ 53.4 కోట్ల డాలర్ల విలువైన కొత్త డీల్స్‌ను కుదుర్చుకుంది. అయితే, ఐటీ రంగం ఇంకా అనిశ్చితిలోనే కొనసాగుతోందని, ఈ మధ్యనే చేపట్టిన పునర్‌వ్యవస్థీకరణ ప్రణాళిక కంపెనీకి దోహదపడుతోందని జోషి పేర్కొన్నారు.

6,000 మంది ఫ్రెషర్ల నియామకాలు

గత మూడు నెలల్లో టెక్ మహీంద్రా ఉద్యోగులు నికరంగా 2,165 మంది పెరిగారు. దాదాపు 1,000 మంది ఫ్రెషర్ల నియామకాలతో పాటు బీపీఓ విభాగంలో మరింత మందిని చేరుకున్నట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రాంగణ నియామకాల ద్వారా 6,000 మంది ఫ్రెషర్లను చేర్చుకోవాలనుకుంటున్నట్లు కంపెనీ ఇదివరకే ప్రకటించింది.

ద్వితీయార్ధంలో సిబ్బందికి వేతన పెంపు

తమ కంపెనీలో పనిచేస్తున్న 1.47 లక్షలకు పైగా ఉద్యోగులకు వేతనాన్ని పెంచాలనుకుంటున్నట్లు జోషి వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధంలో (2024 అక్టోబరు-2025 మార్చి) పెంపు ఉంటుందని, ఇదే విషయాన్ని సిబ్బందికి తెలియజేయడం జరిగిందన్నారు. ఐటీ రంగ కంపెనీలకు ఉద్యోగుల జీతాలే ప్రధాన వ్యయం.

పసిడి పడుతోంది..

న్యూఢిల్లీ: పసిడి, వెండి ధరలు వరుసగా మూడో రోజూ తగ్గుముఖం పట్టాయి.ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర గురువారం మరో రూ.1,000 తగ్గి రూ.70,650 స్థాయికి జారుకుంది. కిలో వెండి ఏకంగా రూ.3,500 తగ్గడంతో ధర రూ.84,000కు దిగివచ్చింది. అంతర్జాతీయంగా వీటి ధరలు గణనీయంగా తగ్గడంతో పాటు దేశీయ బులియన్ మార్కెట్లోనూ జువెలర్లు భారీగా అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. గడిచిన మూడు రోజుల్లో తులం బంగారం రూ.5,000 తగ్గింది. ఈ విలువైన లోహాలపై కస్టమ్స్ సుంకాన్ని 6 శాతానికి తగ్గిస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించడంతో ఈనెల 23న గోల్డ్ రేటు ఏకంగా రూ.3,350 పడిపోయి రూ.72,300 స్థాయికి జారుకుంది. ఈ ఏడాదిలో అదే అతిపెద్ద తగ్గుదల. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర ఒక దశలో 42.20 డాలర్లు తగ్గి 2,421 డాలర్ల స్థాయిలో ట్రేడవగా.. సిల్వర్ 28 డాలర్ల స్థాయికి పడిపోయింది.

మెటల్, బ్యాంకింగ్ షేర్లు పడేశాయ్..

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా ఐదో రోజూ నష్టాలు చవిచూశాయి. గురువారం ట్రేడింగ్ ఆరంభంలోనే 671 పాయింట్ల వరకు క్షీణించి 79,500 దిగువ స్థాయికి జారుకున్న సెన్సెక్స్.. మళ్లీ క్రమంగా తేరుకుని చివరికి 109.08 పాయింట్ల నష్టంతో 80,039.80 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 203 పాయింట్ల మేర పతనమై 24,200 స్థాయికి జారుకుంది. చివర్లో 7.40 పాయింట్ల నష్టంతో 24,406.10 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్ ట్రెండ్ బలహీనంగా ఉండటంతో ఇన్వెస్టర్లు లోహం, బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగాల షేర్లలో అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. మూలధన లాభాలపై పన్ను పెంచడంతో విదేశీ ఇన్వెస్టర్లు మన ఈక్విటీల నుంచి పెట్టుబడులు ఉపసంహరించుకోవడం కూడా మార్కెట్‌పై ఒత్తిడి పెంచింది.

30 నుంచి అకుమ్స్ డ్రగ్స్ ఐపీఓ: అకుమ్స్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ఈ నెల 30న ప్రారంభమై ఆగస్టు 1న ముగియనుంది. ఐపీఓలో విక్రయించనున్న షేర్ల బిడ్డింగ్ ధర శ్రేణిని కంపెనీ రూ.646-679గా నిర్ణయించింది. తద్వారా రూ.1,857 కోట్ల వరకు సమీకరించాలనుకుంటోంది.

ఐపీఓకి స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఈ మేరకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఈ ఇష్యూ ద్వారా కంపెనీ రూ.600 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో రూ.250 కోట్ల మొత్తానికి కొత్తగా రూ.10 ముఖ విలువతో కూడిన ఈక్విటీ షేర్లు జారీ చేయటం ద్వారా సమీకరించనుంది. మిగిలిన రూ.350 కోట్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా సమీకరించనుంది. ఓఎఫ్ఎస్ ద్వారా 1.844 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. ఫార్మాస్యూటికల్, కెమికల్ రంగాలకు అవసరమైన స్పెషలైజ్డ్ ఇంజనీరింగ్ పరికరాల తయారీలో కంపెనీ కీలకంగా ఉంది.

సైయెంట్ లాభంలో 17శాతం క్షీణత

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో సైయెంట్ రూ.1,414 కోట్ల రెవెన్యూపై రూ.141 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 2.8 శాతం, లాభం 17 శాతం క్షీణించాయి. కరెన్సీ మారకం ప్రభావం జూన్ త్రైమాసిక ఫలితాలపై పడిందని, దీంతో డిజిటల్, ఇంజనీరింగ్, టెక్నాలజీ (డీఈటీ) వ్యాపారం క్షీణించిందని కంపెనీ పేర్కొంది. జూన్ త్రైమాసికంలో 5.24 కోట్ల డాలర్ల విలువైన ఆర్డర్లను కంపెనీ చేజిక్కించుకుంది. ఈ ఆర్డర్ల కారణంగా రానున్న త్రైమాసికాల్లో నిలకడైన వృద్ధిని కనబరచవచ్చని భావిస్తున్నట్లు సైయెంట్ తెలిపింది. సమీక్షా త్రైమాసికంలో సెమీకండక్టర్ విభాగంలోకి కంపెనీ అడుగుపెట్టిందని, ఇందుకోసం ప్రత్యేకంగా అనుబంధ సంస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపింది.

48 శాతం తగ్గిన లారస్ ల్యాబ్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి గాను లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ రూ.1,195 కోట్ల రెవెన్యూపై రూ.13 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంతో పోల్చితే ఆదాయం 1 శాతం, లాభం 48 శాతం తగ్గింది. సమీక్షా త్రైమాసికంలో కీలకమైన సీడీఎంఓ క్లినికల్ ప్రాజెక్టుల్లో నిలకడైన పనితీరుతో పాటు అంకాలజీ ఏపీఐ, ఏఆర్‌వీ విభాగంలో పటిష్ఠమైన వృద్ధిని కనబరచటం కలిసివచ్చిందని లారస్ ల్యాబ్స్ సీఈఓ సత్యనారాయణ చావా తెలిపారు. ఈ కాలంలో కంపెనీ సీడీఎంఓ-సింథసిస్ వ్యాపారం రూ.214 కోట్లుగా ఉండగా ఏపీఐ రెవెన్యూ రూ.664 కోట్లుగా ఉంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	69,820 ▼	64,000 ▼	89,000 ▼
ముంబై	68,227 ▼	62,496 ▼	81,474 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

26వ తేదీ

హైదరాబాద్	460	విజయవాడ	480
వరంగల్	462	గోదావరి	475
చిత్తూరు	573	విశాఖపట్నం	485
		దజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	104	విజయవాడ	104
వరంగల్	104	గుంటూరు	107
కరీంనగర్	104	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	104	చిత్తూరు	120
కర్నూలు	104	నెల్లూరు	120
విశాఖపట్నం	93	అనంతపురం	104
గోదావరి	104		

మ్యాన్‌కైండ్ గూటికి బీఎస్‌వీ

- ఒప్పందం విలువ రూ.13,630 కోట్లు
- అడ్వెంట్ ఇంటర్నేషనల్ నుంచి కొనుగోలు



న్యూఢిల్లీ: భారత్ సీరమ్స్ అండ్ వ్యాక్సిన్స్ (బీఎస్‌వీ)లో 100 శాతం వాటాను రూ.13,630 కోట్లకు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు మ్యాన్‌కైండ్ ఫార్మా గురువారం ప్రకటించింది. అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ అడ్వెంట్ ఇంటర్నేషనల్ నుంచి ఈ కంపెనీని చేజిక్కించుకుంది. బీఎస్‌వీ కోసం ఈక్యూటీ, అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ) కన్సార్షియం కూడా పోటీ పడినప్పటికీ అధిక ధరకు బిడ్డింగ్ వేయడం ద్వారా మ్యాన్‌కైండ్ ఈ సంస్థను హస్తగతం చేసుకుంది. బీఎస్‌వీ కొనుగోలు మ్యాన్‌కైండ్ వ్యాపారాన్ని మరింత ఎత్తుకు తీసుకెళ్లనుంది. మహిళల ఆరోగ్యం, సంతాన సాఫల్య ఔషధాల మార్కెట్లో అగ్రగామిగా నిలపనుంది. అలాగే, క్రిటికల్ కేర్‌లో ఇతర ఉత్పత్తుల్లోకీ ప్రవేశం కల్పించనుంది. బయోఫార్మాస్యూటికల్స్‌లో ఐదు దశాబ్దాలకు పైగా అనుభవం కలిగిన బీఎస్‌వీ.. మహిళ ఆరోగ్యానికి సంబంధించి సంతాన సాఫల్యం నుంచి ప్రసవం తర్వాత సంరక్షణలో ఉపయోగించే పలు సంక్లిష్ట ఉత్పత్తులను మార్కెట్లో విక్రయిస్తోంది. "మ్యాన్‌కైండ్ ప్రయాణంలో బీఎస్‌వీ కొనుగోలు కీలక మైలురాయి. మహిళల ఆరోగ్యం, ఫెర్టిలిటీ మార్కెట్లో తమను అగ్రసంస్థగా నిలబెడుతుంది. భవిష్యత్‌లో ఈ విభాగం అపార అవకాశాలు అందించడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా బలమైన వ్యాపార వృద్ధికి బాటలు వేయనుందని భావిస్తున్నా"మని మ్యాన్‌కైండ్ ఫార్మా వైస్ ఛైర్మన్, ఎండీ రాజీవ్ జునేజా అన్నారు.

పిట్టీ ఇంజనీరింగ్ చేతికి దక్షిణ్ ఫౌండ్రీ

డీల్ విలువ రూ.153 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దక్షిణ్ ఫౌండ్రీ ప్రైవేట్ లిమిటెడ్ (డీఎఫ్‌పీఎల్)లో 100 శాతం వాటాలను రూ.153.12 కోట్లకు కొనుగోలు చేసినట్లు పిట్టీ ఇంజనీరింగ్ లిమిటెడ్ వెల్లడించింది. డీఎఫ్‌పీఎల్‌తో ఒప్పందం కుదుర్చుకున్న పదిహేను రోజుల్లో ఈ డీల్‌ను పూర్తి చేయనున్నట్లు పేర్కొంది. జూన్ త్రైమాసికం ముగిసే నాటికి డీఎఫ్‌పీఎల్ వద్ద రూ.42.71 కోట్ల నగదు, బ్యాంక్ బ్యాలెన్స్ ఉంది. డక్టైల్ ఐరన్, గ్రే ఐరన్, లో కార్బన్ అల్లాయ్ స్టీల్ గ్రేడ్స్, సిమో ఐరన్ కాస్టింగ్స్ తయారీలో డీఎఫ్‌పీఎల్ కీలకంగా ఉంది. బెంగళూరు, హోస్కోట్‌లో ఏటా 4,200 టన్నుల స్థాపిత సామర్థ్యం కలిగిన రెండు ప్లాంట్లను నిర్వహిస్తోంది. డీఎఫ్‌పీఎల్ కొనుగోలుతో పిట్టీ ఇంజనీరింగ్ ఉత్పత్తి సామర్థ్యపరంగా మరింత బలోపేతం కానుందని సంస్థ ఎండీ అక్షయ్ ఎస్ పిట్టీ తెలిపారు.

స్థిరాస్తుల అమ్మకాల లాభాలపై కొత్త కొర్రీ

- వడ్డీ, స్టాంప్ డ్యూటీలు ఖర్చులు యథాతథం

న్యూఢిల్లీ: స్థిరాస్తుల అమ్మకాలపై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీటీ) తగ్గించామని చెబుతూనే.. ప్రభుత్వం పెద్ద బాంబు పేల్చింది. ఈ లాభాల లెక్కింపు కోసం ఆస్తుల కనీస విలువను లెక్కించేటప్పుడు, వాటిని కొనేటప్పుడు చెల్లించే స్టాంప్ డ్యూటీ, అప్పు చేసి కొంటే.. ఆ అప్పులపై చెల్లించే వడ్డీల భారం.. ప్రస్తుతం ఉన్న విధంగానే లెక్కింపులోకి రాదని స్పష్టం చేసింది. కేంద్ర రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా గురువారం ఈ విషయం వెల్లడించారు. కొత్త ఎల్‌టీసీజీటీ విధానంలోనూ ఇదే పద్ధతి కొనసాగుతుందన్నారు. దీంతో ద్రవ్యోల్బణం ఆధారంగా లెక్కించే ఇండెక్సేషన్ ఖర్చుల ప్రయోజనం రద్దయి, స్థిరాస్తుల దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్ను భారం 20 శాతం నుంచి 12.5 శాతానికి తగ్గినా అమ్మకందారులకు పెద్దగా ప్రయోజనం లేదని భావిస్తున్నారు.

కెనరా బ్యాంక్ లాభం రూ.3,905 కోట్లు



బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ ముగిసిన త్రైమాసికంలో రూ.3,905 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.3,535 కోట్లతో పోల్చితే లాభం 10 శాతం పెరిగింది. మొండి బకాయిలు తగ్గడం ఇందుకు దోహదపడింది. కాగా బ్యాంక్ త్రైమాసికాదాయం రూ.29,823 కోట్ల నుంచి రూ.34,020 కోట్లకు పెరిగింది. వడ్డీల ద్వారా జూన్ త్రైమాసికంలో రూ.28,701 కోట్లు ఆదాయం లభించింది. నికర వడ్డీ ఆదాయం 6 శాతం వృద్ధితో రూ.8,666 కోట్ల నుంచి రూ.9,166 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్ మాత్రం 3.05 శాతం నుంచి 2.90 శాతానికి తగ్గింది. భవిష్యత్తులో ఎన్ఐఎం మెరుగుపడి 2.95 శాతం వద్ద స్థిరపడుతుందని భావిస్తున్నట్టు బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ కె.సత్యనారాయణ రాజు చెప్పారు. ఆస్తుల నాణ్యత విషయానికి వస్తే బ్యాంక్ స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే 5.15 శాతం నుంచి 4.14 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు కూడా 1.57 శాతం నుంచి 1.24 శాతానికి తగ్గాయి. ఎన్‌పీఏలకు కేటాయింపులు రూ.2,418 కోట్ల నుంచి రూ.2,171 కోట్లకు తగ్గాయి. బ్యాంక్ సీఆర్ఏఆర్ (క్యాపిటల్ అడిక్వసీ నిష్పత్తి) 16.28 శాతానికి పెరిగింది. ప్రొవిజన్ కవరేజి నిష్పత్తి (పీసీఆర్) 118 బేసిస్ పాయింట్లు పెరిగి 89.22 శాతానికి చేరింది. ఈ ఏడాది చివరికి పీసీఆర్ 90 శాతం దాటాలని బ్యాంక్ భావిస్తున్నదని రాజు చెప్పారు. ప్రతి త్రైమాసికంలోనూ రూ.1,000 కోట్లు మొండి బకాయిలు వసూలు చేయాలన్నది తమ లక్ష్యమన్నారు.

రూ.8,500 కోట్ల సమీకరణ

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.8,500 కోట్ల నిధులు సమీకరించేందుకు బ్యాంక్ డైరెక్టర్ల బోర్డు అనుమతించిందని ఎండీ తెలిపారు. టియర్ 1, టియర్ 2 బాండ్ల ద్వారా ఈ నిధులు సమీకరిస్తామన్నారు. అలాగే తమ అనుబంధ సంస్థలు కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, కెనరా రొబెకో ఏఎంసీ రెండింటిలోనూ 25 శాతం వంతున వాటాలు విక్రయించాలని నిర్ణయించినట్టు రాజు వెల్లడించారు.



వ్యవసాయ రంగానికి పెద్దపీట..

- కొక్కిరాల సురేఖ, డీసీసీ అధ్యక్షురాలు



రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగం, మహిళా సంక్షేమానికి పెద్దపీట వేయడం శుభపరిణామం. రైతులకు రుణమాఫీ రూ. 2 లక్షలు చెల్లించేందుకు అవసరమైన నిధులు కేటాయించారు. మహిళా సంక్షేమంలో భాగంగా మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం కోసం సంస్థకు ప్రతి నెలా రూ. 300 కోట్లు ప్రభుత్వం చెల్లిస్తోంది. ఆరోగ్యశ్రీ పరిధిని కూడా పెంచడం ద్వారా ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలకు అధిక ప్రయోజనం చేకూరనుంది. గతంలో రూ. 5 లక్షలు ఉన్న పరిధిని ప్రభుత్వం రూ. 10 లక్షలకు పెంచింది. ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం ప్రతిపాదించారు.

జిల్లాకు మొండిచేయి..

- వెరబెల్లి రఘునాథ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు



రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాకు పూర్తిగా మొండి చేయి చూపారు. కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌తో యేటా కోటపల్లి మండలంలో వేలాది ఎకరాల పంటలు నీట మునుగుతుండగా, రైతులకు తీరని నష్టం వాటిల్లుతోంది. పంట కు నష్టపరిహారం ఇవ్వాలనే ఆలోచన ప్రభుత్వానికి లేకపోవడం దురదృష్టకరం. మంచిర్యాల పట్టణంలోని గోదావరి పై వంతెన, గూడెం ఎత్తిపోతలు చివరి ఆయకట్టు వరకు విస్తరణ, రాళ్లవాగు కరకట్టలు, మాతా శిశు, మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి ఎలాంటి నిధులు కేటాయించలేదు.

ఆశించిన స్థాయిలో లేదు..

- కలవేణ శంకర్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు



తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలు ఆశించిన స్థాయిలో లేదు. వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగానికి పెద్దగా మేలు చేకూర్చేది ఏమీ లేదు. గత ప్రభుత్వ బడ్జెట్‌కు, ప్రస్తుత బడ్జెట్‌కు ఎలాంటి తేడా లేదు. క్షేత్రస్థాయిలో ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా బడ్జెట్ రూపకల్పన జరగాల్సి ఉండగా, ఆ దిశగా కార్యాచరణ జరగలేదని స్పష్టమవుతోంది. మెజార్టీ ప్రజలు తెలంగాణ బడ్జెట్‌పై నిరాశతో ఉన్నారు.

విద్యారంగానికి అన్యాయం..

- బండి రమేశ్, తపస్ రాష్ట్ర అదనపు కార్యదర్శి



రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి రూ. 21,292 కోట్లు కేటయించారు. ఇది గతంలో కేటాయించిన దానికంటే ఎక్కువగా ఉన్నప్పటికీ ఓవరాల్‌గా 9 శాతం మాత్రమే. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించలేదు. గతంలో పెండింగులో ఉన్న మూడు డీఏలతోపాటు కాంగ్రెస్ హయాంలోని రెండు డీఏలు ఇవ్వవలసి ఉండగా వాటి ప్రస్తావన లేదు. కరువు భత్యం, వేతన సవరణ విషయంలో ప్రభుత్వం స్పందిస్తే బాగుండేది.

- పథకాల అమలు లక్ష్యంగా బడ్జెట్ రూపకల్పన
- హామీ మేరకు కేటాయింపులు లేవని విమర్శలు
- రాళ్లవాగు కరకట్టల నిర్మాణానికి చోటు లభించేనా...?
- గోదావరిపై వంతెన ప్రస్తావన లేకపోవడంతో నిరాశ

మంచిర్యాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో గురువారం రాష్ట్ర ఆర్థిక మంత్రి, డిప్యూటీ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన 2024-25 వార్షిక బడ్జెట్‌లో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారనే భావనలో మెజార్టీ ప్ర జలు ఉన్నారు. ప్రభు త్వం ప్రకటించి, ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాల అమలుకు బడ్జెట్‌లో చోటు లభించిందనే అభిప్రాయాలు వ్యక్తమ వుతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో తాత్కాలిక ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా, ప్రస్తుతం పూరిస్థాయి బడ్జెట్‌కు రూపకల్పన చేశారు. ఇం దులో అధికంగా వ్యవసాయ రంగానికి 72,659 కోట్లు కేటాయించారు. కాగా విద్యారంగానికి కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేర కు 15 శాతం నిధులు కేటాయించకపోవడంపై కొంతమేర విమర్శలు వినిపిస్తున్నాయి. ఐదేళ్లుగా కాళేశ్వరం ప్రాజెక్టుల సముదాయంలో ముంపు గురవుతున్న చెన్నూరు, కోటపల్లి మండలాల రైతులకు నష్టపరిహారం ప్రస్తావన లేకపోవడం కూడా విమర్శలకు దారి తీస్తోంది. కాంగ్రెస్ ప్రభు త్వం రైతులను ఆదుకోవలసిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా..

- కామని శ్రీనివాస్, తాండూరు



తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024-25 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా ఉంది. అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని బడ్జెట్‌కు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూపకల్పన చేసింది. ప్రభుత్వ ప్రకటించిన విధంగా ఆరు గ్యారెంటీ పథకాలకు సంబంధించి వివరంగా బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. ఎలాంటి వివక్ష లేకుండా అన్ని రంగాలకు పెద్దపీట వేశారు.

● రాళ్లవాగు ఉప్పొంగితే..

జిల్లా కేంద్రంలో రాళ్లవాగు ఉప్పొంగినప్పుడల్లా యేటా ఏడెనిమిది కాలనీలు పూర్తిగా నీట మునుగుతున్నాయి. దీంతో పట్టణంలోని కార్మెల్ స్కూల్ మొదలుకొని గోదావరి వరకు రాళ్లవాగుకు ఇరువైపులా కరకట్టలు కట్టాలనే ఆలోచన బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసింది. నీటిపారుదల శాఖ అంచనా వ్యయం రిపోర్టు తయారు చేసింది. సుమారు రూ. 250 కోట్ల పై చిలుకు ఖర్చవుతుందని నివేదిక అందజేయడంతో అప్పటి ప్రభుత్వం తన నిర్ణయాన్ని విరమించుకుంది. దీంతో ముంపు ప్రజల అవస్థలు యథాతథంగా ఉన్నాయి. మంచిర్యాల ఎమ్మెల్యేగా ఎన్నికైన కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ఫిబ్రవరిలో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో కరకట్టలు నిర్మించాలనే ప్రతిపాదన తెచ్చారు. ప్రస్తుత బడ్జెట్‌లో కరకట్టలకు ప్రభుత్వం రూ. 500 కోట్లు వెచ్చించినందున రాళ్లవాగుకు అందులో చోటు కల్పిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఇదే జరిగితే గత నాలుగు సంవత్సరా లుగా ముంపు ప్రజలు పడుతున్న బాధలకు విముక్తి లభించినట్లేనన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

● ప్రస్తావనకు రాని పలు అంశాలు..



జిల్లా కేంద్రంలో నూతన మాతా శిశు, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణం, గోదావరిపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం అంశాలు ప్రస్తావనకు రాలేదని చెబుతున్నారు. కోటపల్లి మండలంలో ప్రమాదకరంగా తయారైన రెండు వాగులపై వంతెన నిర్మాణం, బెల్లంపల్లిలోని మామిడి మార్కెట్ యార్డు పూర్తి చేయడం ద్వారా ఇక్కడి రైతులకు మేలు చేకూర్చడం అంశాలను ప్రస్తావించ లేదు. వేమనపల్లి మండల కేంద్రానికి వెళ్లేందుకు అవసరమైన 5 కిలో మీటర్ల మేర బీటీ రహదారి నిర్మాణం ప్రస్తావన బడ్జెట్‌లో లేదు. పై సమస్యలు పరిష్కరిస్తే బాగుండేదనే అభిప్రాయాలు ఉన్నాం

విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

- కుశ్నపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్



ఉరుస్తున్న తరగతి గదిని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

నెన్నెల, జూలై 25: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారు లను ఆదేశించారు. కుశ్నపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్లాస్‌రూములు ఉరుస్తుండడంతో గొడుగులు పట్టుకొని విద్యార్థులు చదువుకుంటున్నారనే విషయంపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. ఆయన గురువారం పాఠశాలను సందర్శించి తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులు ఎంత మంది ఉన్నారు..? క్లాస్ రూమ్స్ ఎన్ని.. ? సమస్య ఎన్ని గదుల్లో ఉంది.. ? ఇప్పటి కి ఏమైనా మరమ్మతులు చేశారా తదితర విషయాలని అడిగి తెలుసుకున్నారు. ఉరుస్తుందని తెలిసి కూడా అదే గదిలో ఎందుకు పిల్లలను కూర్చోబెడుతున్నారని ప్రశ్నించారు. డైనింగ్ హాల్‌లో సర్దుబాటు చేయొచ్చుకదా అన్నారు. వారం రోజుల్లోగా సమస్యను పరిష్కరిస్తామని విద్యార్థులకు భరోసా ఇచ్చారు. పక్కనే ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాల పరిసరాలను పరిశీలించారు. మెనూ అమలును అడిగి తెలుసుకున్నారు. వివిధ సబ్‌జెక్ట్‌ల నుంచి విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమా ధానాలు రాబట్టారు. చదువుతో పాటు ఆటల్లో రాణిం చాలని సూచించారు. కలెక్టర్ ఆదే శాల మేరకు డీఈవో యాదయ్య కుశ్నపల్లి ఉన్నత పాఠశాలకు చేరుకొని సమస్యలు తెలుసుకున్నారు. పిల్లలను ఇతర గదు ల్లో సర్దుబాటు చేశామని, వర్షాలు తగ్గిన వెంటనే మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి, నోడల్ ఆఫీసర్ ప్రకాశ్‌రావు ఉన్నారు.

- కార్యాలయాలు తనిఖీ

మండల పరిషత్తు, తహసీల్దార్ కార్యాలయం, పీహెచ్‌సీలను కలెక్టర్ కుమార్ దీపక్ తనిఖీ చేశారు. పల్లె ప్రగతి, వనమహోత్సవం. ప్రజాపాలన పథకాల అమలు తదితరాల పురోగతిని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ప్రజాపాలన హెల్ప్‌డెస్క్ నిర్వాహణా విధానాన్ని పరిశీలించారు. అర్జీదారుల సమస్యలు తెలుసుకున్నారు. వివరాలను వెంటనే ఆప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు, ఫిర్యాదులు, సిబ్బంది వివరాలను తహసీల్దార్ రమేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన ధరణి సహాయ కేంద్రం గూర్చి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయడంతో ప్రజలు సమస్యల పరిష్కారం రోజుల తరబడి కార్యాలయాల చుట్టు తిరగాల్సిన అవస రం ఉండదన్నారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించారు. వైద్యులు, సిబ్బంది, మందుల నిల్వలపై మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మణ్‌ను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవల అందించాలని సూచించారు. ఇన్‌పేషెంట్ల వద్దకు వెళ్లి వైద్య సేవలు, సిబ్బంది పనితీరు గూర్చి అడిగి తెలుసుకున్నారు. సబ్ సెంటర్లలో విధులు నిర్వర్తించే తమకు పీహెచ్‌సీలో నైట్ డ్యూటీల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏఎన్ఎంలు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. డీఎంహెచ్‌వోతో మాట్లా డుతానని కలెక్టర్ తెలిపారు.

కుశ్నపల్లి జడ్పీఎస్ఎస్ హెచ్ఎం సస్పెన్షన్

- ఉరుస్తున్న గదిలో పిల్లలను కూర్చోబెట్టడంపై కలెక్టర్ సీరియస్

నెన్నెల, జూలై 25: ఉద్దేశపూర్వకంగా విద్యాశాఖను, ప్రభుత్వాన్ని బదనాం చేశారని కుశ్నపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం టి ఇందర్‌సింగ్‌ను అధికారులు గురువారం సాయంత్రం సస్పెండ్ చేశారు. జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ ఆదేశాల మేరకు సస్పెన్షన్ ఉత ్తర్వులు జారీ చేసినట్టు జిల్లా విద్యాధికారి యాదయ్య తెలిపారు. వర్షానికి ఉరుస్తున్న తరగతి గదిలో విద్యార్థులు గొడుగులు పట్టుకొని పాఠాలు విన్న సంఘటనపై జిల్లా కలెక్టర్ సీరియస్ అయ్యారు. గురువారం ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు, పేరెంట్స్‌తో మాట్లాడారు. ఉరుస్తున్న గదులను పరిశీలించారు. గ్రిల్స్ కలిగిన రెండు వరండాలు, డైనింగ్ హాల్ ఉన్నాయని వాటిని ఉపయోగించుకునే వీలుందన్నారు. 8వ తరగతిలో 11 మంది విద్యార్థులు మాత్రమే ఉండటంతో వారిని ఎక్కడైన సర్ధుబాటు చేయవచ్చని, అలా కాకుండా పిల్లలను ఉరుస్తున్న గదిలోనే గొడుగులు పట్టుకొని కూర్చోబెట్టి ఉద్దేశ పూర్వకంగా విద్యాశాఖను, ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే ప్రయత్నం చేశారని డీఈవో పేర్కొన్నారు. ఫొటోలు, వీడియోలు తీయించి సామాజిక మాధ్యమాల ద్వారా వైరల్ చేయడంలో హెచ్ఎం ప్రమేయం ఉందని గుర్తించి శాఖా పరమైన చర్యలు తీసుకున్నామని డీఈవో తెలిపారు. కాగా ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించకుండా హెచ్ ఎంను బాధ్యుడిని చేసి చర్యలు తీసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జలదిగ్బంధంలో ఐదు గ్రామాలు

వేమనపల్లి, జూలై 25 : ఆరు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రాణహిత నది ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో నది బ్యాక్ వాటర్‌తో మండలంలోని సుంపుటం, జాజులపేట, ముక్కిడిగూడెం, కల్లెంపల్లి, రాచర్ల గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఈ గ్రామాలకు వెళ్లే రోడ్ల గుండా ప్రాణహిత నది బ్యాక్ వాటర్ ప్రవహిస్తుండడంతో పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను నిలిపివేశారు. దీంతో గురువారం నుంచి ఈ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ గ్రామాల ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. సుంపుటం, జాజులపేట, ముక్కిడిగూడెం, కల్లెంపల్లి గ్రామాల ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాలంటే దహెగాం మండలం మొట్లగూడెం, రాంపురం మీదుగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే అదనంగా 50 కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి వస్తుంది. రాచర్ల గ్రామస్థులు బయటకు వెళ్లాలంటే కోటపల్లి మండలం జనగామ, ఏదులబంధం దారిలో వెళ్లాల్సి ఉంటుంది. ఈ దారిలో కూడా కొన్ని ఒర్రెలు, వాగులు రోడ్లపై నుంచి ప్రవహిస్తుండడంతో అతి కష్టం మీద చెన్నూరుకు చేరుకుంటున్నారు. ప్రాణహిత నది వరద తగ్గేంత వరకు జలదిగ్బంధంలోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సుంపుటం శివారులో రోడ్డుపై ప్రవహిస్తున్న ప్రాణహిత బ్యాక్ వాటర్

జిల్లాలో 18.2 మిల్లీమీటర్ల వర్షం



వరదనీటిలో మునిగిన పత్తి చేలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

మంచిర్యాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లాలో గడిచిన 24 గంటల వ్యవధిలో 18.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. వేమనపల్లి మండలంలో 25.1, కోటపల్లి మండలంలో 24.8, దండేపల్లి మండలంలో 23.6, జన్నారం మండలంలో 23.3 మిల్లీమీటర్లు, చెన్నూరు మండలంలో 21.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. హాజీపూర్, కన్నెపల్లి మండలాల్లో 19.1, భీమారం మండలంలో 19.0, లక్షెట్టిపేట మండలంలో 18.9, నెన్నెల మండలంలో 18.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. హాజీపూర్ మండలం గుడిపేట సమీపంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 20,998 క్యూసెక్కుల నీరు చేరుతోంది. ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 148 మీటర్లకు గాను ప్రస్తుతం 145.73 మీటర్లకు చేరుకున్నది. ప్రాజెక్టు సామర్థ్యం 20.175 టీఎంసీలకుగాను ప్రస్తుతం 14.270 టీఎంసీల నీరు ఉంది.

కోటపల్లి: మండలంలోని ప్రాణహిత నది పరివాహక ప్రాంతాల్లో నీట మునిగిన పంటలను గురువారం వ్యవసాయాధికారి మహేందర్ నాటు పడవలో వెళ్లి పరిశీలించారు. అన్నారం గ్రామంలో నీట మునిగిన పత్తి పంటలను నాటు పడవలోవెళ్లి పరిశీలించిన ఏవో జరిగిన నష్టంపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని తెలిపారు.

చెన్నూరు: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు జన జీవనం స్తంభించిపోయింది. వర్షంతో మండలం, పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండలంలోని అక్కెపల్లి లోలెవల్ కాజ్‌వేపై వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. సుద్దాల, కత్తెరసాల, బుద్దారం, సంకారంతో పాటు పట్టణంలోని బతుకమ్మ వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీసీపీ

నెన్నెల, జూలై 25: నెన్నెల పోలీస్ స్టేషన్‌ను డీసీపీ భాస్కర్ గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. క్రైం రేట్, కేసుల నమోదు, కేసుల పరిష్కారం, నేరస్థుల వివరాలను ఎస్సై ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. పోస్టులు, ఖాళీలు, విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది వివరాలపై వాకాబు చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి డీసీపీ సలహాలు, సూచనలు చేశారు. ఆయన వెంట బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ ఉన్నారు.

భీమిని: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను డీసీపీ భాస్కర్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, రిసెప్షన్, లాకప్, మెన్ బ్యారక్, టెక్నికల్ రూం, పరిసరాలను పరిశీలించారు. ఆయన వెంట బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, తాండూరు సీఐ కుమారస్వామి ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై దృష్టి సారించాలి

చెన్నూరు, జూలై 25: వర్షాల నేపథ్యంలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దృష్టి సారించాలని చెన్నూరు ప్రత్యేకాధికారి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు సూచించారు. చెన్నూరులోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను గురువారం సందర్శిం చారు. భోజనం, వంటశాల, డైనింగ్ హాల్‌ను పరిశీలించి వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని కత్తెరసాల గ్రామంలో పర్యటించారు. పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజ్మత్‌అలీ తదితరులు ఉన్నారు.

చెత్తాచెదారం తొలగించాలి

గ్రామాల్లో చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తొలగించాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు సూచించారు. గురువారం చెన్నూరు మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజ్మత్ అలీ, ఏపీవో గంగాభవానీ, కార్యదర్శులు పాల్గొన్నారు.

యాదవులకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలి

మంచిర్యాల అర్బన్, జూలై 25: యాదవులకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి మంత్రివర్గంలో స్థానం కల్పించాలని జాతీయ యాదవ హక్కుల పోరాట సమితీ అధ్యక్షుడు మేకల రాములు అన్నారు. గురువారం జిల్లా అధ్యక్షుడు పెండ్లి అంజయ్య అధ్యక్షతన జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో అయన మాట్లాడారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బండి మల్లన్న, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గిరవేన సంపత్, జిల్లా ప్రధాన కార్యదర్శి గజనవేన శ్యామ్‌కుమార్, జిల్లా యూత్ అధ్యక్షుడు చీర్య శశిధర్, పట్టణ అధ్యక్షుడు పర్ష రాజన్న, బేరి రామయ్య, మేకల గట్టయ్య, రమేశ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కాసిపేట, జూలై 25 : కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుద్దవాగు బ్రిడ్జి వద్ద స్కూటీ అదుపు తప్పి కింద పడిన ఘటనలో కాసిపేటకుచెందిన పెంజర్ల లక్ష్మణ్ (33) అనే యువకుడు మృతిచెందినట్లు కాసిపేట ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలి పారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం. లక్ష్మణ్ సోమగూడెం నుంచి కాసిపేటకు స్కూటీపై వేగంగా వెళ్తుండగా స్కూటీ అదుపు తప్పి కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలై రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. మృతుని తండ్రి బాపు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అంతిమయాత్రలో డప్పు కొడుతూ ఒకరు..

కాసిపేట, జూలై 25:. శవ అంతిమ యాత్రలో డప్పు కొడుతూ రడపాక బాపు (53) అనే వ్యక్తి గురువారం గుండెపోటుతో మృతిచెందాడు. కాసిపేటకు చెందిన వేల్పుల అంకులు అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. ఆయన మృతదే హాన్ని ముత్యంపల్లిలోని శ్మశానవాటికకు డప్పు చప్పుళ్లతో తీసుకువెళ్తున్నారు. కాసి పేట అశోక్‌నగర్‌కు చెందిన రడపాక బాపు డప్పు వాయిస్తూ కుప్పకూలి పో యాడు. సహచరులు వెంటనే కాసిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

రోడ్డుపైకి చేరిన వరదనీరు

- గర్భిణి ఆసుపత్రికి వెళ్లేందుకు ఇబ్బందులు

- అర కిలోమీటరు వరద నీటిలో నుంచి నడక

- 108లో చెన్నూరు ప్రభుత్వాసుపత్రికి తరలింపు



గర్భిణిని వరద నీటిలో నుంచి తీసుకువస్తున్న ఆశా కార్యకర్త

వేమనపల్లి, జూలై 25: మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలంలో ప్రాణహిత నది బ్యాక్ వాటర్ రోడ్డుపైకి భారీగా చేరడంతో గురువారం గర్భిణిని ఆసుపత్రికి తరలిచేందుకు ఇబ్బందులు పడ్డారు. వేమనపల్లి మండలం జాజులపేట గ్రామానికి చెందిన దన్నూరి భారతి అనే గర్భిణిని ఆగస్టు మొదటి వారంలో ప్రసవం కోసం రావాలని వైద్యులు సూచించారు. వర్షాలు, వరదల దృష్ట్యా ముందు జాగ్రత్తగా తరలించేందుకు కుటుంబీకులు సిద్ధమయ్యారు. భారీగా వరదనీరు నిల్వడంతో వేమనపల్లి-జాజులపేట మార్గాన్ని అధికారులు గురువారం సాయంత్రం బారికేడ్లతో మూసివేశారు. ఈ క్రమంలో గర్భిణిని తరలించేందుకు అప్పటికే 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది సుంపుటం సమీపంలో వాహనాన్ని నిలిపిఉంచారు. జాజులపేట నుంచి గర్భిణిని ఆటోలో ఆమె భర్త, ఆశా కార్యకర్త వరదనీరు నిలిచిన అవతలి వైపు వరకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి వరదనీటిలో సుమారు అర కిలోమీటరు గర్భిణిని ఆశా కార్యకర్తను నడుచుకుంటూ ఇవతలి వైపు 108 నిలిచిన స్థలానికి తీసుకొచ్చారు. అప్పటికే సమాచారం మేరకునీల్వాయి ఎస్ఐ శ్యామ్‌పటేల్ అక్కడకు చేరుకున్నారు. గర్భిణిని, ఆమె భర్తను, ఆశా కార్యకర్తను సురక్షితంగా వరద నుంచి దాటించి అంబులెన్స్‌లో ఎక్కించారు. దీంతో అంబులెన్స్ ఈఎంటీ రమేశ్, పైలెట్ ఇమామ్‌షరీఫ్ గర్భిణిని చెన్నూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వ్యభిచారం చేస్తున్న ఆరుగురి పట్టివేత

మంచిర్యాల అర్బన్, జూలై 25: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తా సమీపంలో గల ఓ లాడ్జిలో వ్యభిచారం చేస్తూ ఆరుగురు పట్టుబడినట్లు పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి లాడ్జిలో వ్యభిచారం చేస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. పట్టుబడిన వారిలో లాడ్జి ఓనర్ సిరిపురం శ్రీనివాస్‌తో పాటు బెల్లంపల్లికి చెందిన తిప్పరవేణి అఖిల్, హాజిపూర్‌కు చెందిన మేడిపట్ల అరుణ్, ముగ్గురు మహిళలు ఉన్నారని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.